ప్రజాశక్తి
సోమవారం 8 మే 2023
5
అల్లూరి సీతారామరాజు



అక్రమ కట్టడం నిలిపివేయాలి

- గిరిజన సంఘం నేతల డిమాండ్

ప్రజాశక్తి - అనంతగిరి:గిరిజన హక్కులు, చట్టాలను కాలరాస్తూ గిరిజనేతరుడు అక్రమంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తక్షణం నిలిపివేయాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సివేరి కొండలరావు, జె.సుబ్బారావులు డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో వారు ఆదివారం మాట్లాడుతూ, మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయానికి సమీపాన వైయస్సార్ వీధిలో గిరిజనేతరుడు అక్రమ కట్టడం నిర్మిస్తుంటే రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోలేదని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిలను కాపాడవలసిన అధికారులే గిరిజనేతరులకు కొమ్ము కాస్తూ అక్రమ కట్టడాలను ప్రోత్సహించడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. పనులను నిలిపి వేయకపోతే గిరిజన సంఘం ఆధ్వర్యంలో అక్రమ కట్టడాన్ని కూల్చి వేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కట్టడాలను కూల్చి వేయకుంటే ఈ విషయమై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు.

అల్లూరి ఆశయ సాధనకు కృషి

-ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలు -పలువురు ఘన నివాళి



అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా బ్రిటిష్ పాలకులను ఎదిరించి పోరాడిన అల్లూరి సీతారామరాజు మనందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కొనియాడారు. అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ ఆవరణలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరిని ఆదర్శంగా స్ఫూర్తిగా తీసుకుని గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం పునరంకితం అవుదామని కలెక్టర్ పిలుపు నిచ్చారు. బ్రిటిష్ వారిపై పోరాటం చేయడానికి వీలుగా పాపికొండలు ప్రాంతంలో నివాసం ఏర్పరుచుకొని గిరిజనులను అల్లూరి చైతన్య పరిచారన్నారు. ఆదివాసులు, రైతులు, సానుభూతిపరులను సమీకరించి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా గొరిల్లా పోరాటాలలో నిమగ్నమయ్యారని, పోలీస్ స్టేషన్లపై దాడి చేశారని, ఆతని వీరోచిత పరాక్రమాలను చూసి గిరిజనులు "మన్యంవీరుడు" గా కీర్తించారని కలెక్టర్ వివరించారు. గిరిజనుల సంక్షేమం కోసం, బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించిన అల్లూరి సీతారామరాజు పేరుతో మనకు కొత్త జిల్లా ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, డిఆర్ఓ పి.అంబేద్కర్ పాల్గొన్నారు.

పాడేరుటౌన్:మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఐటిడిఏ పిఓ వి.ఎస్.ప్రభాకరరావు, పరిపాలన అధికారి హేమలత పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ఐటిడిఏ ఆవరణలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సిబ్బంది పాల్గొన్నారు.

ముంచింగిపుట్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సంఘం మండల అధ్యక్షుడు కే సూర్యప్రకాష్, కార్యదర్శి ఎం.నవ సూర్య, నాయకులు అఖిల్, తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరిలో...

అనంతగిరి:మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయం వద్ద అల్లూరి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. టోకురు సర్పంచ్ కిల్లో .మొస్య అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు జె.సుబ్బారావులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో హైడ్రోపై పోరాటం

గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో హైడ్రో పవర్ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు పోరాటం ఉధృతం చేస్తామని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పి.అప్పలనర్స మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక గిరిజనులకు సంపద పై అధికారం ఉండాలని, అడవి హక్కు ఇవ్వాలని, బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధానికి వ్యతిరేకంగా అల్లూరి పోరాటం నిర్వహించారన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో తన ప్రాణాన్ని ప్రాణంగా పెట్టీ విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో స్ఫూర్తిని రగిలించిన మహనీయుడన్నారు.ఏజెన్సీ ప్రాంతంలో కార్పొరేట్ కంపెనీలకు అమ్ముడు పోయిన గిరిజన ప్రజా ప్రతినిధులపై పోరాటం ఉధృతం చేయాలన్నారు.హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం పేరుతో రాష్ట్రంలో గిరిజనుల అధీనంలో ఉన్న 15వేల ఎకరాల అటవీ భూమిని అదానీ, శిర్డి సాయి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కు అప్పగించాలని వైసిపి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్పించడంపై అసెంబ్లీ తీర్మానం ఏకపక్షంగా చేయడం సరికాదన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లక్కు, మండల నాయకులు ఎల్. సుందరరావు, వరహాలబాబు, దాస్, చిన్నారావు, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న అప్పలనర్స

అల్లూరి స్ఫూర్తితో ఉద్యమం : లోతా రామారావు

రాజవొమ్మంగి : గిరిజన హక్కులు, చట్టాల పటిష్ట అమలుకు అల్లూరి స్ఫూర్తితో మరో పోరాటం చేద్దామని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా మండలంలోని పూదేడు, దుర్గానగర్ తదితర గ్రామాల్లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండలంలోని లోదొడ్డి పంచాయతీ పూదేడు గ్రామంలో జరిగిన అల్లూరి వర్ధంతిలో లోతా రామారావు పాల్గొన్నారు. గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు జర్త రాజు, మండల నేతలు వెలుసూరి సత్యనారాయణ, మేలిన రమేష్, పొత్తురు సత్యనారాయణ, మనుగుల రాజుబాబు, ఎల్. శ్రీను, పి.రమేష్, జె.ఉపేంద్ర, పి. లోవరాజు, వి. గంగ, చంటమ్మ పాల్గొన్నారు.



రాజఒమ్మంగిలో...

విఆర్.పురం: అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని రేఖపల్లి సిపిఎం కార్యాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి గిరిజన సంఘ మండల కార్యదర్శి పూనం ప్రదీప్‌కుమార్ పూల మాలలు వేసి ఘననివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, మండల నాయకులు పంకు సత్తిబాబు, సోడి మల్లయ్య, నల్లారిపు ప్రకాశరావు పాల్గొన్నారు.



కొయ్యూరులో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

కొయ్యూరు: రాజేంద్రపాలెం అల్లూరి పార్కులో అల్లూరి విగ్రహానికి గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎస్ సూరిబాబు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. గిరిజన సంఘం మండల నేతలు గూడెం లక్ష్మణ్, చిన్నారావు పాల్గొన్నారు.

కొయ్యూరు : అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో అల్లూరితోపాటు గాంమల్లుదొర, గాంగంటం దొర, బోనంగి పండు పడాల్ విగ్రహాలకు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఐటిడిఎ పిఒ అభిషేక్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంమల్లుదొర కుటుంబ సభ్యులను సన్మానించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడారు.ఎంపిపి బడుగు రమేష్, జెడ్‌పిటిసి వారా నూకరాజు, చింతపల్లి జెడ్పిటిసి పోతురాజు బాలయ్యపడాల్, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, వైస్ ఎంపిపిలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ముసలినాయుడు, ట్రైకార్ డైరెక్టర్ సరస్వతి, సుర్ల లోవరాజు, వైసీపీ మండల ప్రెసిడెంట్ జల్లి బాబులు, మండల ఇన్‌చార్జ్ సుధాకర్, రాజఒమ్మంగి ఎంపిపి వెంకటలక్ష్మి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అచ్చిరాజు, గాడి సత్తిబాబు, గంగాధర్, సూరిబాబు, పాల్గొన్నారు.

చింతూరు : మండలంలోని ఎర్రంపేటలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి గిరిజనసంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, జిల్లా నాయకులు సీసం.సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి స్ఫూర్తితో జిఒ 3 పునరుద్ధరణ, జిఒ 52 రద్దుకు పోరాడదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు పాంద్రం నాగార్జున, సుబ్బారావు, శ్యామల, తమ్మయ్య, కారం సుందరయ్య, పాంద్రం ముత్తమ్మ, కారం అమల, శ్యామల, సాయమ్మ, లచ్చయ్య పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

గిరిజన జాతరకు ప్రత్యేక శానిటేషన్ బృందాలు


'ప్రజాశక్తి'తో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కొండలరావు

ప్రజాశక్తి-పాడేరు: గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గ్రామీణ రైతుల పురోభివృద్ధికి దోహదపడే వర్మి కంపోస్టుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమ్మర కొండలరావు వెల్లడించారు.ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లాలో గ్రామపంచాయతీల పరిధిలో ప్రగతి కార్యక్రమాలపై తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే.....



జిల్లాలో ప్రారంభించిన వర్మి కంపోస్టులు

జిల్లా పరిధిలో ప్రస్తుతం 249 వర్మి కంపోస్టులు పూర్తయ్యాయి. ఇంకా 181 వర్మీ కంపోస్టులు మంజూరయ్యాయి. ఒక షెడ్‌తో పాటు ఒక గది నిర్మాణం చేస్తున్నాము. రైతుల ఉద్యాన వ్యవసాయ రంగాలకు ఉపయోగకరంగా ఈ వర్మి కంపోస్టుల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో జనాభా ప్రాతిపదికన సుమారు 5 లక్షల నుంచి 11 లక్షలు వరకు వెచ్చించి ఈ వర్మి కంపోస్టుల నిర్మాణం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జరుగుతోంది.



పంచాయతీల ఆదాయం పెంపునకు చర్యలు?

గ్రామపంచాయతీ నిర్ణయం మేరకు జిల్లాలో అన్ని గృహాలను, వ్యాపార దుకాణ సముదాయాలను పన్ను పరిధిలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పూరి గుడిసెలు మినహా మిగిలిన అన్ని ఆవాసాలను పన్ను పరిధిలోకి తెచ్చేందుకు పది రోజులపాటు ప్రత్యేకంగా ఎన్యుమరేషన్ నిర్వహిస్తున్నాం. రెగ్యులర్ షాపులు తదితర వాటికి లైసెన్స్ ఫీజులు తప్పనిసరిగా వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పంచాయతీలో పన్నుల వసూలు పై ప్రత్యేక దృష్టి సారించే విధంగా కృషి చేస్తున్నాం.

వీధిలైట్లు, మీటర్ల ఏర్పాటుకు చర్యలు?

జిల్లాలో పిడబ్ల్యూ స్కీమ్స్ వీధిలైట్ల నిర్వహణ క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో పారిశుధ్య పనులు

జిల్లాలోని 430 గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరాయంగా రోజువారి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చెత్త సేకరణ సంపద కేంద్రాల నిర్వహణ పనులు నిర్దిష్టంగా అమలు చేయగలుగుతున్నాం.

జాతరకు ఏర్పాట్లు

జిల్లా కేంద్రం పాడేరులో ఐదు రోజులపాటు జరగనున్న రాష్ట్ర గిరిజన ఉత్సవాలకు పెద్ద ఎత్తున జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భక్తులు తరలి రానున్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డబ్ల్యూఎస్ ద్వారా కోడలి ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపడుతున్నాం. ఈ జాతర నేపథ్యంలో పట్టణంలో ఆరు రోజులపాటు పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు 9 స్పెషల్ శానిటేషన్ టీములను ఏర్పాటు చేస్తున్నాం. ఈ విధంగా పారిశుధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇందుకు సంబంధించి ఒక ఎంపీడీవో, ఈవోఆర్డి పర్యవేక్షణలో ఈ శానిటేషన్ బృందాలు పని చేస్తాయి. అనకాపల్లి జిల్లా నుంచి 200 మంది స్వీపర్లను అదనంగా ఇక్కడ నియమిస్తున్నాం. ప్రస్తుతం పట్టణంలో జంగిల్ క్లియరెన్స్, డ్రైనేజీ క్లీనింగ్ తదితర పారిశుద్ధ్య పనుల నిర్వహణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. ఈ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

104 ఉద్యోగుల సమస్యలపై

నేటి నుంచి నిరసనలు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:104 ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయాలని 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుండి 14వ వరకు జరిగే ఉద్యమంలో ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు.అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో సునీల్ అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు జిల్లా యూనియన్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఉద్యోగుల, కార్మికులు సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యారని తెలిపారు.సమస్యలు పరిష్కారం చేయాల్సిన ప్రభుత్వం ఉద్యమిస్తున్న కార్మికులు, ఉద్యోగులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 104 ఉద్యోగులను ఆప్కాస్‌లో కలపాలన్నారు. జీవో 4459 ప్రకారం పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిబ్బందిని అప్‌గ్రేడ్ చేసి వేతనాలు జమ చేయాలని, ప్రతినెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను స్థానిక ప్రదేశాలకు బదిలీ ఆకాశం కల్పించి, ఫుడ్, ట్రావెల్ అలవెన్స్ వంటి సదుపాయం కల్పించాలని చెప్పారు. వాహనాలను సర్వీసింగ్ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు సూర్యనారాయణ పడాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామ్మూర్తి నాయుడు, పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -ఎటపాక : ఈనెల10న జరిగే పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎటపాక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామ సత్యనారాయణ పత్రికా ప్రకటనలో తెలిపారు. గడచిన 22 రోజులుగా 10వ తరగతి పూర్తయిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించి, ప్రభుత్వ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్ ఇచ్చామన్నారు. ఉచిత కోచింగ్‌కు సహకరించిన ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, విభాగాధిపతులు, సిబ్బందికి ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలిపారు. మే 10నఉదయం 11 గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాలిసెట్ పరీక్ష జరుగుతుందని, ఉదయం 10 గంటలకు పరీక్ష హాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారన్నారు. విద్యార్థులు హెచ్‌బి పెన్సిల్, ఎరైజర్, వెంట తెచ్చుకోవాలని సూచించారు. హాల్ టికెట్ రానివాళ్లు appolycet.nic వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. రంపచోడవరం మన్యంలో పాలిసెట్ పరీక్ష మూడు కేంద్రాల్లో జరుగుతుందన్నారు. ప్రభుత్వం పాలిటెక్నిక్ కాలేజీలో 300మంది, జవహర్ నవోదయ విద్యాలయ కేంద్రంలో 358మంది, చింతూరు గిరిజన పాఠశాలలో 372 మంది విద్యార్థులను పాలిసెట్ పరీక్ష రాసేందుకు కేటాయించామన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- ▸▸ జోరుగా శతకంపట్టు పందిరి నిర్మాణ పనులు
- ▸▸ విద్యుత్ సెట్టింగ్స్ పనుల్లో ఉత్సవ కమిటీ నిమగ్నం



శతకంపట్టు పందిరి నిర్మాణ పనులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్ : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్న మోదకొండమ్మ ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో, పాడేరుకు వారం రోజులు ముందే మోదకొండమ్మ పండగ కళ వచ్చింది. ఆలయ కమిటీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి నేతృత్వంలో ఉత్సవాలను నిర్వహించనున్నారు. ప్రస్తుతం విద్యుత్ అలంకరణ పనులు జోరుగా సాగుతున్నాయి.పట్టణంలో ఎటు చూసినా ఉత్స వాల పనుల సందడే కనిపిస్తుంది. ఈనెల 14 నుంచి మూడు రోజులపాటు జరిగే మోదకొండమ్మ ఉత్సవాల్లో విద్యుత్ అలంకరణకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.ఉత్సవాలకయ్యే వ్యయంలో సగం నిధులు విద్యుత్ అలంకరణకే ఖర్చు చేస్తారంటే.. ఏర్పాట్లు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఉత్సవాలు దగ్గర పడుతుండటంతో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలి సమీపంలో, చాకలిపేట జంక్షన్, సినిమాహాల్ కూడలి, పిఎంఆర్‌సి జంక్షన్ సమీపంలో భారీ స్థాయిలో కర్రలతో టవర్లను నిర్మిస్తున్నారు. ఆయా టవర్లపై పురాణాలకు సంబంధించిన ఒక అంశంపై విద్యుత్ అలంకరణతో సెట్టింగ్ ఏర్పాటు చేస్తారు. అలా ఒక్కో టవర్ పై ఒక్కో రకమైన దానిని ఏర్పాటు చేస్తారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా శతకం పట్టు వద్దకు తీసుకువెళ్లి అక్కడ ప్రతిష్ఠించి మూడు రోజులు అక్కడే ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఆ శతకంపట్టు పందిరి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అంబేద్కర్ కూడలి నుంచి అటు అరకులోయ వెళ్లే మార్గంలో సుమారుగా రెండు కిలోమీటర్ల వరకు, ఇటు చోడవరం, జి.మాడుగుల వెళ్లే మార్గాల్లోనూ రెండేసి కిలోమీటర్ల దూరం వరకు విద్యుత్ దీపాలంకరణ చేస్తారు. ఉత్సవాలకు వచ్చే వారికి పట్టణంలోని ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ సెట్టింగులు, వివిధ రకాల లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మూడు రోజులు వివిధ వేదికలపై నిర్వహించే ప్రదర్శనల కంటే లైటింగ్స్‌నే అందరూ దృష్టి సారిస్తారు. లైటింగ్ ఏర్పాట్లను బట్టి ఉత్సవాలకు ఏ స్థాయిలో జరుగుతాయోనని భక్తులు అంచనా వేస్తారు. పట్టణమంతా లైటింగ్ ఏర్పాటు చేయడంతోపాటు పాడేరుకు సమీపంలోని తలారిసింగి, గొందూరు కాలనీ, సుండ్రుపుట్టు వంటి ప్రాంతాల వరకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు.



అంబేద్కర్ కూడలి వద్ద విద్యుత్ సెట్ వేసేందుకు కర్రలతో కట్టిన టవర్

చింత చిగురుతో చిన్నారులకు ఆదాయం

ప్రజాశక్తి -చింతూరు : చింత చిగురును సేకరించి అమ్మడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని తల్లిదండ్రులకు అందజేస్తూ వారికి గిరిబాలలు చేదోడువాదోడుగా ఉంటున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పాఠశాలల నుంచి ఇళ్లకు చేరుకున్న చింతూరు మండల కేంద్రంలోని గిరిజన చిన్నారులు వేసవి సెలవుల్లో తమ గ్రామాల్లోని చింత చెట్లపై ఉన్న లేత చిగురును సేకరించి మండల కేంద్రంలోని రోడ్డు పక్కన చిన్న పోగులు వేసి, ఒక్కొక్కటీ రూ.పది చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా రోజుకు రూ.100 నుంచి రూ.200 వరకు ఆదాయాన్ని సేకరించి, వాటిని ఇంటికి తీసుకెళ్లి తమ తల్లిదండ్రులకు అందజేస్తున్నారు. చింతచిగురులో అనేక పోషక విలువలు ఉండడంతోపాటు, కూరల్లో దీన్ని వేసి వండితే మంచి రుచి వస్తుండడంతో పలువురు చింతచిగురును ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు.. చింతూరు ఏజెన్సీ అడవుల్లో అత్యధికంగా చింత చెట్లు కలిగి ఉన్నాయి. చింత చెట్టు లేని గ్రామం ఉండదంటే అతిశయోక్తి కాదు. సీజన్లో చింతపండు సేకరించి గిరిజనులు ఆదాయం పొందుతారు. ఇపుడు చింతచిగురు అమ్మి, కాస్తోకూస్తో కుటుంబానికి చేదోడుగా ఉండాలని వేసవి సెలవుల్లో ఖాళీగా ఉన్న విద్యార్థులు అనుకోవడం మంచిదే అయినా, చింతచిగురు సేకరించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు. లేకుంటే ప్రమాదమని హెచ్చరిస్తున్నారు.



చింతచిగురు పోగులుగా వేసి అమ్ముతున్న గిరిబాలలు

ప్రతిఒక్కరికీ పునరావాసం కల్పించాలి

ప్రజాశక్తి- మారేడుమిల్లి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులైన ప్రతిఒక్కరికీ పునరావాసం, ప్యాకేజీ వర్తింపజేయాలని మానవ హక్కుల ఫోరం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు అక్కిస బాలు అన్నారు. నిర్వాసితులకు పునరావాస సాధనకు సమస్యను సంబంధిత కమిషనర్ల దృష్టికి తీసుకెళతామన్నారు. ఆదివారం మానవహక్కుల ఫోరం దేవీపట్నం అధ్యక్షుడు సిద్ద సత్యనారాయణ అధ్యక్షతన ఇందుకూరు ఆర్అండ్ఆర్ కాలనీ సచివాలయం ఆవరణలో నిర్వహించిన నిర్వాసితుల సదస్సులో మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతో నిర్వాసితులైన వందల కుటుంబాలకు నేటికీ అర్హుల జాబితాలో పేర్లు లేకపోవడం శోచనీయమన్నారు. దీనిపైనే ప్రధానంగా సమావేశంలో చర్చించి, నిర్వాసితుల సమస్యలను విన్నారు. ప్రధానంగా అన్నీ అర్హతలున్నా ప్యాకేజి రాకపోవడంపై విస్మయం వ్యక్తచేశారు. గిరిజనులంతా ఎస్‌టి కమిషన్ దృష్టికి, దళితుల తరపున ఎస్‌సి కమిషన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. ఎస్‌సి, ఎస్‌టియేతరులంతా కోర్టుకు వెళదామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంజం రాజమణి, వైసిపి నేత పోలిశెట్టి శివరామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు గేదెల పెదసుబ్బారావు పుడిపల్లి, రమణయ్యపేట. తదితర గ్రామాలనుంచి బాధితులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలు

యుటిఎఫ్ ఆర్థిక సాయం



నగదు సాయం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని తూటంగి పంచాయతీ దాతూరు ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయుడు శుభ అర్జున్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం ఆయన పెద్దకర్మను వారి స్వగ్రామమైన హుకుంపేట మండలం బొడ్డ పూట్టు పంచాయతీ మండి పూట్టు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ ఎస్ కన్నయ్య, స్థానిక మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు రూ.10 వేలతో పాటు 25 కిలోల బియ్యంను బాధిత కుటుంబానికి అందజేశారు. మృతుడు అర్జున్ మాస్టర్ ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పని చేసి గిరిజన విద్యాభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించారని యుటిఎప్ నేతుల కొనియాడారు.ఆర్థిక సహాయం అందించేందుకు విరాళాలు అందించిన ఉపాధ్యాయులు అందరికీ యుటిఎఫ్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సీనియర్ నాయకులు ఎల్.సింహాద్రి, జీ.దుక్కు, మేఘనాథ్, టి డుంబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ ప్రతిష్ట

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని సింగరాయలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామ ఆలయం ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి భర్త, నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ అరకు ఎంపీ మాధవి సిఫార్సు మేరకు ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షల ఆర్థికసాయం చేశామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గుడి ఆవరణలో టైల్స్ ఏర్పాటుకు అరకు ఎంపీ మాధవి సూచనల మేరకు నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా రూ.15వేల ఆర్థికసాయాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా గుడి పెద్దలు, గ్రామస్తులు, భక్తులు అరకు ఎంపి గొడ్డేటి మాధవి శివప్రసాద్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉల్లి సూరిబాబు,ఉల్లి జగన్, బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు నర్సి కిరణ్, నేను సైతం ఛారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశాలకు ఆన్లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వేములపూడి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ఆసక్తి కలవారు ఈనెల 10వ తేదీ నుండి %https/apms.ap.gov.in/apms% అనే వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని, చివరి తేదీ మే 25 అని తెలిపారు. జూన్ 11న ఆదివారం ఉదయం పది గంటలకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ లకు రూ.75, ఓసీ, బీసీ లకు 150 రూ. ఫీజు చెల్లించవలసి ఉంటుందన్నారు. ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్‌ను మోడల్ స్కూల్ లో అందజేయాలని సంధ్యారాణి తెలిపారు.

ఇద్దరికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండల సమాఖ్యలో వికలాంగుల సామాజిక పెట్టుబడి నిధి(సిఐఎఫ్) దుర్వినియోగంపై గతంలో రోలుగుంట సిసిగా పని చేసిన(ప్రస్తుతం కె.కోటపాడు ఏపిఎం) పి.వెంకటలక్ష్మికి, గతంలో సిసిగా పని చేసిన(ప్రస్తుతం రావికమతం సిసి) పైల వెంకటసత్యనారాయణలకు డిఆర్‌డిఎ పిడి బి.లక్ష్మీపతి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రోలుగుంట వికలాంగుల సమాఖ్యలో నగదు పుస్తకం ఆధారంగా మండలంలోని 53 సంఘాలకు రూ.42లక్షల రుణాలను 2006 సంవత్సరంలో మంజూరు చేశారని, వీటి దుర్వినియోగం జరిగినట్టు విచారణలో తేలినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగానే కొమరవోలు గ్రామ సంఘంలో శివాజీ సంఘానికి సిఐఎఫ్ కింద మంజూరు చేసిన రూ.1,25,000లలో అప్పటి సిసి పి.వెంకటనాగేశ్వరరావు, సంఘం సభ్యులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారని సదరు షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని అందులో పిడి స్పష్టం చేశారు.

జర్నలిస్టు వేణుకు ఘన సన్మానం

ప్రజాశక్తి- వడ్డాది: ఏపీయూడబ్ల్యూజే మాడుగుల ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో బుచ్చయ్య పేట మండల విలేఖరి వేణును ఘనంగా సన్మానించారు. ఆదివారం తులసి కళ్యాణమండపంలో జరిగిన ఏపీయూడబ్ల్యూజే సిల్వర్ జూబ్లీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విలేకరిగా ఉత్తమ సేవలు అందించిన బత్తుల వేణుని జర్నలిస్ట్ సంఘాలు సన్మానించాయి. మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గౌరీపట్నం త్రినాథ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ సాయిబాబా, ఏపియు డబ్ల్యూజె జిల్లా కార్యదర్శి జోగినాయుడు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు చంద్రరావు, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు శరగడం రామకోటి, మాడుగుల ప్రెస్ క్లబ్ కార్యదర్శి వేణు, సీనియర్ జర్నలిస్ట్ సురేష్ శాంతో, రబ్బ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుంతల్లో వర్షపు నీరు తొలగింపు

ప్రజాశక్తి -రావికమతం: గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కవగుంట గ్రామ ఆర్ అండ్ బి రోడ్డు మధ్యలో నిలిచిన నీటిని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కవగుంట గ్రామపంచాయతీ పరిసర ప్రాంతాల్లో సుమారు ఐదు గ్రానైట్ క్వారీలు ఉన్నాయన్నారు. క్వారీ లారీలు అధిక బరువుతో కవగుంట గ్రామం మీదుగా తరలించడంతో గ్రామం మధ్యలో నాలుగైదు చోట్ల భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో చినుకు పడితే గొయ్యలు పూర్తిగా నీటితో నిండి పోతున్నాయన్నారు. వాహన చోదకులు, పాదచారులు గొయ్యిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.సర్పంచ్ చొరవ తీసుకొని నీటిని బయటకు తొలగించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ వరకుమారి భీమన్నదొర, యూత్ ప్రెసిడెంట్ శేషు పాల్గొన్నారు.

అరకొర వేతనం..అగమ్య గోచరం

20 సంవత్సరాలుగా మూగజీవాలకు సేవలు
కల్పించని ఉద్యోగ భద్రత
అయోమయంలో గోపాలమిత్రలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: పాడి పరిశ్రమ అభివృద్ధిలో కీలకమైన గోపాలమిత్రలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ కృత్రిమ గర్భోత్పత్తి, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ ఇలా అనేక సేవలు అందిస్తూ శ్రమిస్తున్న గోపాలమిత్రలకు ప్రభుత్వం నుంచి ఆదరణ కరువైంది. 20 సంవత్సరాలుగా సేవలందిస్తూ శ్రమిస్తున్న గోపాల మిత్రులు శ్రమదో పిడీకి గురవుతున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు న్యాయం చేస్తాయనే ఆశ వారిలో సన్నగిల్లుతోంది

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 25 మంది గోపాల మిత్రలు పని చేస్తున్నారు. నాడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో భాగంగా మన ప్రభుత్వం వస్తే గోపాల మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించి న్యాయం చేస్తానని మాట ఇచ్చారు. నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా ఆ హామీ అమలు కాలేదు. వీరంతా పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశుసంవర్ధక శాఖలో సేవలందిస్తున్నారు. ఇందుకుగాను నెలకు రూ.6,500 గౌరవ వేతనం మాత్రమే అందిస్తున్నారు. అది కూడా ఏ ఐదు నెలలకో, ఆరు నెలలకో ఒకసారి మాత్రమే ఇస్తున్నారు. 2022 డిసెంబర్ నుండి 2023 మే నెల వస్తున్నా ఇప్పటివరకు ఆ గౌరవ వేతనం అందలేదు. గ్రామాలలో వీరి పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. రైతు భరోసా కేంద్రాల్లో పని చేసే పశు సహాయకులకు సమానంగా సేవలందిస్తున్నా వీరికి మాత్రం కేవలం రూ.6,500రూ మాత్రమే వేతనం వస్తుంది. రెండు దశాబ్దాలుగా అందిస్తున్న వీరి సేవలతో పాడి పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. కృత్రిమ గర్భధారణ ద్వారా సంకరజాతి పాడి పశువుల అభివృద్ధే ధ్యేయంగా పాల ఉత్పత్తి గణనీయంగా పెంచేందుకు వీరు ఎంతో కృషి చేశారు. అయినా వీరికి సరైన గుర్తింపు లేదు. రైతు భరోసా కేంద్రాల్లో జగన్ ప్రభుత్వం పశు సహాయకులను నియమించడంతో వీరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీరంతా అభద్రతా భావంతో జీవితం నెట్టుకొస్తున్నారు. సచివాలయ సిబ్బంది మాదిరిగా యాప్ ద్వారా హాజరు వేసినప్పటికీ ప్రభుత్వపరంగా గుర్తింపు లేదు.

గోపాలమిత్రలు విజయవాడలో ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పుడు మంత్రిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ హామీతో నిరసన విరమించినా అవి నీటి మూటలుగానే మిగిలి పోయాయి. ఎంతో మంది మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ప్రస్తుతం వీరికి 20 సంవత్సరాల సర్వీసు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించలేదు. గ్రామాల్లో పని చేస్తున్న తమ పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సమాజాభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-మాడుగుల: సమాజానికి పాత్రికేయులు ఎంతో అవసరమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక తులసి కళ్యాణ మండపంలో మాడుగుల ప్రెస్ క్లబ్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సమస్యలు, లోటుపాట్లు వెలుగులోకి తీసుకు వచ్చి సమాజ అభివృద్ధికి మీడియా ప్రతినిధులు శ్రమిస్తున్నారన్నారు. కొందరు పాత్రికేయులు లేని విషయాలు వెలుగులోకి తీసుకు వచ్చి సమస్యలు సృష్టించడం సరి కాదని అన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లికు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ద్వారా బహుమతుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ పోలి నాయుడు, ఎంపిపి పెదబాబు, సర్పంచ్ కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు, గోళ్ళవిల్లి సంజీవరావు, డిపిఆర్ఓ సాయి బాబా, కర్రి సత్యం, పుప్పాల అప్పలరాజు, దంగటి సూర్యారావు, ఎపియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు స్వామి, కార్యదర్శి జోగి నాయుడు, చంద్ర రావు, రామకోటి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు త్రినాథ్, వేణు, సురేష్ సాంతో తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: ఏ.పీ.యూ.డబ్ల్యూ.జే మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా రావికమతం మండలానికి చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి ఇల్లపు చిన్న సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ, మాడుగుల ప్రెస్ క్లబ్ పరిధిలోని నాలుగు మండలాల విలేకరుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

శిథిలావస్థలో వంతెనలు

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ, కొయ్యూరు మండలాలను కలుపుతూ ఉన్న పురాతన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా కృష్ణదేవిపేట, చీడిగుమ్మల, గుజ్జుమానుపాక, పెదమాకవరం తదితర వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. దీంతో, ఇటుగా ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కృష్ణదేవిపేట, గుజ్జుమనుపాకల, చీడిగుమ్మల వంతెనలను నిర్మించి ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా అవుతోంది. వీటికి మరమ్మత్తులు చేపట్టక పోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ వంతెనలు బలహీనపడటానికి కారణం గతంలో వీటికి సమీపంలో ఇసుక తవ్వకాలు జరగడమేనని తెలుస్తోంది. నిత్యం మైదాన, ఏజెన్సీ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వందలాది ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు ఈ వంతెనల మీదుగా వెళ తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగు తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పెదమాకవరం తదితర వంతెనల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

అనకాపల్లి జిల్లా తూర్పుగోదావరి జిల్లాల సరిహద్దులను కలిసే ఈ వంతెనలు కూలితే వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. కృష్ణదేవిపేట వంతెన నుంచి రాకపోకలు నిలిచిపోతే గమ్యస్థానాలకు చేరాలంటే అదనంగా మరో 10 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. పెదమాకవరం వంతెన నుంచి రాకపోకలు నిలిచిపోతే కృష్ణదేవిపేట నుంచి చింతపల్లి, పాడేరు తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే 50కిలో మీటర్ల దూరం ప్రయాణించి నర్సీపట్నం మీదుగా వెళ్లాల్సి వస్తుంది. చీడిగుమ్మల వంతెన కూలితే కృష్ణదేవిపేట, ఏళేశ్వరం ప్రయాణికులు నాతవరం మీదుగా 20 కిలో మీటర్లు అదనంగా ప్రయాణించి నర్సీపట్నం రావలసి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వంతెనల మరమ్మత్తులకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దీనిపై ఆర్అండ్‌బి ఏఈఈ ప్రసాద్ వివరణ కోరగా కృష్ణదేవిపేట, గుజ్జుమనుపాకల, చీడిగుమ్మల వంతెనలను 1936లో నిర్మించగా మరో పదేళ్ల గడువు ఉందన్నారు. వీటికి మరమ్మత్తులు చేపట్టాల్సి ఉందన్నారు. దీని కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. రామరాజుపాలెం వంతెన స్థానంలో కొత్తగా వంతెన నిర్మాణం చేపడు తున్నామని చెప్పారు. పెదమాకవరం వంతెనను కూల్చి వేసి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొత్త వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-సీతమ్మధార : అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందినట్లు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... తాటిచెట్ల పాలెం రైల్వే క్వార్టర్స్ వెనుక కార్ డ్రైవింగ్ సీట్‌లో సతీష్ కుమార్ (40) మృతిచెంది ఉన్నాడు. స్థానికులు చూసి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. మృతుడు అన్న సునీల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ షణ్ముఖరావు తెలిపారు.



పట్టుబడ్డ గంజాయి

19 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నంకు చెందిన ఓ ప్రైవేటు బస్సులో 19 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామని గొలుగొండ ఎస్ఐబి సిఐ రాజారావు పేర్కొన్నారు. అల్లూరి జిల్లా చిత్రకొండ నుంచి నర్సీపట్నానికి వెళుతున్న ఎస్ఆర్‌సిఎంటికి చెందిన బస్సులో గంజాయి రవాణా జరుగుతుందని ముందస్తు సమాచారం రావడంతో గొలుగొండ మండలం ఏటిగైరంపేట వద్ద శనివారం సాయంత్రం బస్సును ఆపి తనిఖీ చేశామన్నారు. 19 కేజీల గంజాయి లభ్యమైందని, నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద 12వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకున్నామన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో తాళ్ళపాలెం జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం తాళ్లపాలెం జెడ్‌పి హైస్కూల్ ఎదురుగా, జాతీయ రహదారిపై, అనకాపల్లి నుండి ఎలమంచిలి పోవు రోడ్డులో గుర్తుతెలియని 40-45ఏళ్ల వయస్సు గల వ్యక్తి రోడ్డు దాటుతుండగా, అనకాపల్లి నుంచి ఎలమంచిలి వైపు కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. దీనిపై వీఆర్ఓ బొడ్డేడ శివాజీ కశింకోట పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ ఆదినారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌సి కాలనీలో డ్రెయినేజీ శుభ్రం చేయాలి

కెవిపిఎస్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కొంతలం గ్రామంలో ఎస్సీ కాలనీ డ్రైనేజీని శుభ్రం చేసి నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, కొంత కాలంగా ఎస్సీ కాలనీలో డ్రైనేజీ దుర్భరంగా ఉందన్నారు. డ్రైనేజీ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ లేకపోవడంతో వర్షం పడినప్పుడు నీరు ఇళ్లల్లోకి చేరుతుందన్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీని శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు కె.బాలరాజు, స్థానిక మహిళలు పాల్గొన్నారు


ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖకు మరో మణిహారం సీ - హారియర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖకు మరో మణిహారంగా సీ - హారియర్ మ్యూజియం నిలవనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఈ నెల 11న విశాఖలో జరిగే ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆయన పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మలతో కలిసి ఆదివారం పరిశీలించారు. సిఎం పర్యటించే సీ - హారియర్ యుద్ధ విమాన మ్యూజియం, వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం, ఆరిలోవ అపోలో ఆసుపత్రి ప్రదేశాలకు వెళ్లి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీ - హారియర్ మ్యూజియం విశాఖ వాసులకు, టూరిస్టులకు మరింత సమాచారాన్ని, ఆహ్లాదాన్ని చేకూరుస్తుందని అన్నారు. టియు 142, కురుసుర సబ్‌మెరైన్‌లకు సీ - హారియర్ మ్యూజియం కూడా తోడవడంతో విద్యార్థులు, యువత ఎన్నో విషయాలను తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన యుద్ధ విమానాన్ని గోవా నుంచి తీసుకువచ్చామని, ముఖ్యంగా ఐదు అంశాల ద్వారా ప్రదర్శన ఉంటుందని తెలిపారు. త్వరలోనే దీన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ నేవీ, ఎయిర్ ఫోర్స్‌కు సంబంధించిన సాంకేతిక అంశాలను ప్రజలు తెలుసుకునే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని, కానీ ఈ మ్యూజియం ఏర్పాటు ద్వారా యువత, పిల్లలు ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ సీ - హారియర్ మ్యూజియం గొప్పతనాన్ని వివరించారు.

అనంతరం వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం వద్ద ముఖ్యమంత్రి హెలీప్యాడ్ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేడియం వద్ద ఏర్పాటు చేయనున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కార్యక్రమ ఏర్పాట్లపైనా చర్చించారు. ఆరిలోవలో అపోలో క్యాన్సర్ ఆసుపత్రిలో కార్యక్రమ ఏర్పాట్లపై ఆసుపత్రి నిర్వాహకులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్ రెడ్డి, విఎంఆర్‌డిఎ, జివిఎంసి, ఆర్ అండ్ బి, పోలీసు, ఫైర్, ఎపిఇపిడిసిఎల్ అధికారులు పాల్గొన్నారు.

నవ్వుతో ఒత్తిడిని జయించొచ్చు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నవ్వడం ఒక యోగమని, నవ్వడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. బీచ్ రోడ్డులోగల బాల వికాస్ ఫౌండేషన్ బ్రిడ్జి స్కూల్‌లో ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేది నవ్వేనని, విద్యార్థులకు సమస్యలను ఎదుర్కోవడానికి ఆత్మస్థైర్యం అవసరమని, అందుకు నవ్వే సులువైన మార్గమని తెలిపారు. ఈ సందర్భంగా బాలలకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, సుజాత, మంజు, అప్పారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్

ఎంవిపి.కాలనీ : నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు (నీట్) విశాఖ నగరంలో ఆదివారం ప్రశాంతంగా సాగింది. నగరంలోని మల్కాపురం, తాటిచెట్లపాలెం సహా అన్ని కేంద్రీయ విద్యాలయాల్లోనూ, విశాఖ వ్యాలీ స్కూల్‌లోనూ ఈ పరీక్ష నిమిత్తం పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వద్ద కనిపించారు. సిసి కెమెరాల నీడన పరీక్షలు సాగాయి. ఎక్కడికక్కడ పోలీసు పహారా కనిపించింది.

ఆదివాసీ హక్కుల రక్షణకు ఉధృత పోరాటం

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గిరిజన హక్కుల రక్షణకు పోరాటానికి సిద్ధం కావాలని ఆదివాసీలకు గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. డాబాగార్డెన్స్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం గిరిజన సంఘం విశాఖ జిల్లా మహాసభ జరిగింది. తొలుత అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి మహాసభ ఘన నివాళులర్పించింది. అనంతరం ముఖ్య అతిథి సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలోకి చేర్చుతూ తీర్మానం చేసిందన్నారు. ఆ ప్రయత్నాన్ని అల్లూరి స్ఫూర్తితో తిప్పికొట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ చట్టాలను ఉల్లంఘిస్తూ బడా కార్పొరేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్టులు, మైనింగ్ పేరుతో అడవిని అప్పగిస్తున్నాయని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లోకి గిరిజనేతరులు వచ్చే విధంగా చట్టాలను మారుస్తోందన్నారు. అటవీ సంపదపై గిరిజనులకు పూర్తి హక్కు ఉండే విధంగా నాడు అల్లూరి సీతారామరాజు ఎలాంటి పోరాటం నడిపారో గుర్తుచేశారు. హక్కుల కోసం పోరాడుతున్న గిరిజనులపై నేటి పాలకులు నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. జిఒ నెంబర్ 3 చట్టబద్ధతకు పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం సంఘం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సంఘం విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కిముడు చిన్నంనాయుడు, జివి.రమణమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఉల్లి బొంజుబాబు, ఆఫీస్ బేరర్లుగా కృష్ణ నాయక్, సత్యనారాయణ, సాంబమూర్తి, పార్వతమ్మ, పద్మ, సోబన్ కుమార్, గోపాల్, బి.తౌడన్న, జె.రామన్న, టి.చిట్టిబాబు, జానకిరాజు, సత్యారావు, గీత ఎన్నికయ్యారు.

ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలి

సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్


మాట్లాడుతున్న తపన్‌సేన్

ప్రజాశక్తి - ఉక్కునగరం

ప్రభుత్వ ఆదేశాలతో వైజాగ్ స్టీల్ యాజమాన్యం కార్మికుల నూతన వేతనాల అమలుపై చేస్తున్న తప్పుడు ప్రచారాలు తక్షణం ఆపాలని, ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఉక్కునగరంలోని సంఘం కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం ముఖ్య కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్‌జెసిఎస్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా నేడు స్టీల్ కార్మికుల వేతన ఒప్పందం జరిగిందని అన్నారు. ప్రతి వేతన ఒప్పందం ప్రతి ఒక్క యూనియన్ అంగీకారంతోనే ఇప్పటి వరకూ జరిగి అమలవుతున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ నేడు దానికి విరుద్ధంగా మెజారిటీ నిర్ణయాన్ని అంగీకరిస్తున్నామని చెప్పి దొడ్డిదారిన ప్రభుత్వ ఆదేశాలతో స్టీల్ యాజమాన్యం మెలగడం దుర్మార్గమన్నారు. ఈ ఒప్పందంతో స్టీల్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు విఘాతం కలగడంతోపాటు నూతన కార్మికుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుందని తెలిపారు. అందుకే సిఐటియు ఈ ఎంఒయుపై సంతకం చేయలేదని అన్నారు. నూతన ఎంఒయు ద్వారా కార్మిక ప్రయోజనాలను రక్షించే విధంగా యాజమాన్య ప్రతిపాదనలతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. అస్తవ్యస్త నిర్ణయాలతో నేడు అమలవుతున్న స్టీల్ కార్మికుల వేతనాలపై కార్మికుల్లో అశాంతి నెలకొందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో స్టీల్ యాజమాన్యాలు అనుసరిస్తున్న వైఖరిపై మార్పు కోరుతున్నామని, లేనిపక్షంలో తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. స్టీల్‌వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా మాట్లాడుతూ కార్మిక సంఘాల ఐక్యతకు విఘాతం కలిగించేదుకు యాజమాన్యం చేసిన కుట్రలో కొన్ని యూనియన్లు భాగస్వామ్యంకావడం దురదృష్టకరమని అన్నారు. ఎన్నడూ లేని విధంగా నూతన వేతన ఒప్పందంపై అలుముకున్న నీలినీడలను కార్మిక వర్గ ఐక్యతతో విచ్ఛిన్నం చేయాలని అన్నారు. స్టీల్ కార్మికవర్గం సత్యాన్ని గ్రహించి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారపోయడమే బిజెపి విధానమని విమర్శించారు. దీనిని ప్రతిఘటించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, నాయకులు జగ్గు నాయుడు, కెఎం.శ్రీనివాస్, ఎన్.రామారావు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జె.అయోధ్యరామ్, వైటి.దాస్, యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, యు.వెంకటేశ్వర్లు, టివికె.రాజు, పుల్లారావు, యు.మరిడయ్య, గంగాధర్, కెవి.సత్యనారాయణ, నీలకంఠం పాల్గొన్నారు


మాట్లాడుతున్న కెఎ.పాల్

దేశాన్ని ప్రైవేటీకరిస్తున్న మోడీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని ప్రైవేటీకరిస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే చర్యలు చేపడుతున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ అన్నారు. ఆశీలు మెట్ట వద్ద ఉన్న కెఎ.పాల్ ఫంక్షన్ హాల్‌లో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో లాభాల్లో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్, ఎల్ఐసిలను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, అందుకు జూన్ 8వ తేదీ వరకూ గడువు ఇస్తున్నామని అన్నారు. తర్వాత పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్రం అనుమతిస్తే నెల రోజుల వ్యవధిలో అమెరికా నుంచి రూ.4 వేల కోట్లు తెచ్చి ప్లాంట్ పరిరక్షణతో పాటు విస్తరణ పనులు చేపడతామన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జూన్ 4న కెఎ పాల్ ఫంక్షన్ హాల్ వద్ద భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం పోరాడుతున్న నాయకులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు కెఎస్ఎన్.రావు, రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, విల్లా రామ్మోహన్ కుమార్ పాల్గొన్నారు.


ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న అతిథులు

ప్రతిభా పురస్కారాల అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఉత్తరాంధ్ర శిష్టకరణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. శిష్టకరణం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టర్నర్ చౌల్ట్రీలోని మెయిన్ రోడ్డులో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు మనాపురం సురేష్ అత్యధిక మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర శిష్టకరణం కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, ఉరిటి అప్పారావు, జర్నలిస్టు సంఘం నాయకులు పోతుమహంతి నారాయణ, డబ్బీరు గాయత్రి, పాల్తేరు జయపట్నాయక్, ఎం.రవికాంత్ పాల్గొన్నారు. సదాశివుని కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉరిటి అప్పారావు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు.